క్లుప్తంగా

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్



తాగునీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ సోమవారం చేపట్టారు. ప్రతి ట్యాంకును పరిశుభ్రం చేసి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు సిబ్బందిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని: మండలంలో 11 కేవీ కొత్త లైన్ వేయనున్న నేపథ్యంలో కొరమ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరమ నుంచి లివిరి మధ్య గ్రామాల్లో సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోలార్ ల్యాంప్‌లతో విద్యుత్ ఆదా

వీరఘట్టం: విద్యుత్ ఆదా చేసేందుకు సోలార్ ల్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక మేజర్ పంచాయతీ ఈఓ బి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పలు వీధుల్లో సోలార్ ల్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకమీదట అన్నివీధుల్లో సోలార్ ల్యాంప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ నీలకంఠం, సిబ్బంది

కొమరాడ: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో ఎస్ఐ కె.నీలకంఠం సిబ్బంది కలిసి అటువైపుగా వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, గుట్కావంటి మాదకద్రవ్యాలు, తుపాకులు ఏమైనా రవాణా జరుగుతున్నాయా అనే కోణంలో పోలీసులు వాహనాల్లో సోదాలు చేపట్టారు.

గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న హోలీక్రాస్ డైరెక్టర్ ప్రభుదాస్

భామిని: నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసేందుకు గాను అవసరమైన నిర్మాణ సామగ్రి అందజేస్తామని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె. ప్రభుదాస్ అన్నారు. ఆదివాసీ గిరిజన లబ్ధిదారులతో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. సెల్విప్ సంస్థ సహకారంతో గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామగ్రి అందజేయడానికి 49 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కీర్తిరాయి సుగ్రీవులు, సాంబరో, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పందాల రాయుళ్ల అరెస్ట్

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామ సమీపంలో కోడిపందాలు జరుగుతుండగా రూరల్ పోలీసులు దాడిచేసి 5 కోళ్లు రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రై సైకిల్ మంజూరు చేయాలి



ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరుతున్న దివ్యాంగులు

పార్వతీపురం: తమ వ్యక్తిగత పనులు నిర్వహించేందుకు ట్రై సైకిల్స్‌ను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయానికి దివ్యాంగులు వచ్చారు. ఈ మేరకు సాలూరు మండలం వెలగవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొట్టిశ సీతారాం, మజ్జి రాములు తమకు చార్జింగ్ ట్రై సైకిళ్లను మంజూరు చేయాలని కలెక్టర్‌కు అర్జీని అందజేసేందుకు వచ్చారు. ఎన్నోసార్లు ట్రైసైకిల్ మంజూరు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. ట్రై సైకిల్ ఉంటే కొద్ది దూరమైనా రాకపోకలు చేసేందుకు అవకాశం ఉంటుందని వారు ప్రాథేయపడ్డారు. అధికారులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

బాబు హయాంలో సంక్షేమం నిల్..



సీతంపేట: కూటమి వైఫల్యాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- పాత పనుకువలసలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

సీతంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో సంక్షేమం ఎక్కడా కానరావడం లేదని.. ముఖ్యంగా గిరిజనాభివృద్ధి వెనక్కి వెళ్లిపోయిందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని పాత పనుకువలసలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బాబు వైఫల్యాలను ఎండగడుతూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. అనేక నూతన సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా గిరిజనులకు ఇళ్ల వద్దే పథకాలు అందించినట్లు తెలిపారు. అయితే అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని మరుగున పడేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేవలం రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలు తప్ప ఈ ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ హామీల అమలు గాలి కొదిలేశారన్నారు. ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే అనేక అవస్థలు పడుతున్నామని పలువురు గిరిజనులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు విజయకుమారి, ఆరిక కళావతి, ప్రవీణ్, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎన్.కృష్ణ, వెంకీ, ఎస్.మహేష్, ఎన్.అబ్బాస్, ఎస్.వెంకటేష్, రంగారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి జ్వరపీడితుల తాకిడి



ఏరియా ఆస్పత్రి ఓపీ వద్ద రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి జ్వరపీడితుల తాకిడి పెరిగింది. సోమవారం మొత్తం ఓపీ 320 రాగా వంద మంది జ్వరాలతో బాధ పడుతున్నట్లు నిర్ధారించారు. మిగతా వారు వివిధ రోగాలతో బాధపడుతున్నారు. ఇన్‌పేషెంట్లుగా 37 మందిని చేర్చుకున్నారు. మలేరియా ఆర్‌డీటీ 16, స్లైడ్ పాజిటివ్ ఒకటి వచ్చినట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. అందరికీ రక్త పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారించి వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్ శివన్నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

భామిని: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్, తదితరులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 5న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. డిగ్రీలో ప్రవేశాలు చేపట్టాలని.. మేజర్, మైనర్ ఆన్సర్ విధానం రద్దు చేయాలని కోరారు. డీటీ శంకరరాయుడు, ఆర్ఐ మణిప్రభాకర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమణ

గరుగుబిల్లి: సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా కార్యదర్శి బీవీ రమణ పిలుపునిచ్చారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో సోమవారం జరిగిన సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, కార్మికులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారానికి మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31, 2026 జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో, పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండలో సెప్టెంబరు 13, 14వ తేదీల్లో జిల్లా మహాసభలు ఉంటాయన్నారు. కార్మికులంతా సభలకు హాజరై తమ గళం విప్పాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు గౌరమ్మ, సావిత్రి, గంగాభవాని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు దత్తత బాధ్యతలు సరికాదు



పీ4 సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి సన్యాసిరావు

గుమ్మలక్ష్మీపురం: పేదలను ఉద్యోగులు దత్తత తీసుకుని వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని చెప్పడం సరికాదని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం.సన్యాసిరావు ఖండించారు. మండలంలోని లుంబేసు గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీవో పి.త్రివిక్రమరావు ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీ4 సర్వే, మార్గదర్శి–కుటుంబం పథకంల ముఖ్య ఉద్దేశాలు ఎంపీడీవో తెలిపారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్త చేస్తూ సన్యాసిరావు మాట్లాడారు. పేదలను ఆదుకోవడానికి ఎన్ఆర్ఐలు, దాతలెవరూ ముందుకురాకపోవడంతో ఉద్యోగులకు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెబుతుండడం దుర్మార్గమన్నారు. పేదలను సంక్షేమ పథకాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల ద్వారా ప్రభుత్వమే ఆదుకోవాల్సింది పోయి ఇలా ఉద్యోగులపై భారం మోపాలనుకోవడం ఏంటని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదలను ఆదుకునే చర్యలు చేపట్టాలని హితవుపలికారు. సమావేశంలో సర్పంచ్ తోయక సీతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎం.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన తప్పనిసరి



సంపరకోటలో డెంగీపై అవగాహనా ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో డెంగీ, తదితర జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎం. సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణా మాసోత్సవాల నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలోగల బర్న, సీతంపేట, జంపరకోట, తదితర మైదాన ప్రాంత గిరిజన గ్రామాల్లో వెల్‌నెస్ కేంద్ర సిబ్బంది అవగాహనా ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి భువనేశ్వర్, ఎంపీహెచ్ఈఓ తేజ, పీహెచ్ఎన్ అధికారి శారద, సిబ్బంది ప్రవీణ్, పెంటయ్య, నోషన్, టి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని ఏపీటీడబ్ల్యూహెచ్ఎస్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో ఎంతోమంది యువత ఫ్యాషన్ మాయలో పడి గంజాయి, ఖైనీ, గుట్కా, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత అంతా మంచి అలవాట్లు అలవర్చుకుని ఉన్నతమైన జీవనం సాగించాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కొమరాడ: వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎస్.రమేష్ సూచించారు. మండలంలోని ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాల, సచివాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి పీ4 సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పకడ్బందీగా యాంటీ లార్వా ఆపరేషన్



యాంటీ లార్వా ఆపరేషన్ పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: యాంటీ లార్వా ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని హడ్డుబంగి పంచాయతీ పరిధి పనసగూడలో దోమల కారక లార్వాను నివారించడానికి సోమవారం యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహనరావు, మలేరియా నివారణా కన్సల్టెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో డీఆర్ డిపో భవనం



గుమ్మలక్ష్మీపురం మండలం, దేరుబాడ గ్రామ డీఆర్ డిపో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రేషన్ సరుకులు భద్రపరచడం, వాటిని తిరిగి లబ్ధిదారులకు ఇవ్వడం వంటి విధులు భయానక వాతావరణంలో నిర్వహించాల్సి వస్తోందని డిపో సేల్స్‌మేన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు శ్లాబు కారిపోతోందని, కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.

–గుమ్మలక్ష్మీపురం

అనుమతులు లేకుండా చెట్లు నరికిన విద్యుత్ శాఖ

సాలూరు రూరల్: మండలంలోని సాలూరు నుంచి మామిడిపల్లివరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు ఆర్అండ్‌బీ అనుమతులు లేకుండా నరికేశారు. మామిడిపల్లి రోడ్డులో వాహన చోదకులు ప్రయాణించేటప్పుడు మండువేసవి లో కూడా చెట్ల నీడతో చల్లగా ఉండేది. మామి డిపల్లి రోడ్డుపై ద్విచక్రవాహన చోదకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆనందంతో ప్రయాణించేవారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ కొత్త లైన్లు వేస్తుండడంతో భారీ వృక్షాలకు కొ న్ని చోట్ల కొమ్మలు నరికివేస్తుండగా కొన్నిచోట్ల చెట్టు మొదలు వరకు నరికేస్తున్నారు. పచ్చదనం పరిశుభ్రత అంటూ చెట్లు నాటేందుకు ప్రభుత్వాలు కోట్లు రూపాయలు ఖర్చుచేస్తుంటే కాపాడాల్సిన అధికారులే అభివృద్ధి పేరుతో చెట్లు నరికేస్తున్న దృశ్యాలను చూస్తుంటే ఎంతో బాధాకరంగా ఉంటోందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నరికివేసిన చెట్లు కొమ్మలను పక్కనున్న పంటపొలాల్లో కొమ్మలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ విజయ్ కుమార్ మాట్లాడుతూ చెట్లు నరుకుతున్న విషయాన్ని తమ శాఖకు తెలియజేయలేదని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

లోకోస్ యాప్‌లో బ్యాంక్ లావాదేవీలు



వీఓఏలకు సూచనలిస్తున్న ఏపీఎం రాము, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లలితకుమారి

వీరఘట్టం: ఇక నుంచి గ్రామ సంఘాల బ్యాంక్ లావాదేవీలు గాని, మండల సమాఖ్య లావాదేవీలు గాని లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం కె.రాము సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇక నుంచి మనం చేసే ఆర్థిక లావాదేవీలన్నీ లోకోస్ యాప్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి మాట్లాడుతూ.. వీరఘట్టంలో ఉన్న మహిళా మార్ట్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని నెలలుగా ఇక్కడ వ్యాపారం డీలా పడిందని.. మరలా డ్వాక్రా మార్ట్‌ను గాడిలో పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఏపీఎంనకు సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

సీతంపేట: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, అఖిల్ మాట్లాడుతూ.. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలు.. 5న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని.. డిగ్రీలో మేజర్, మైనర్ ఆనర్స్ విధానం రద్దు చేయాలన్నారు.

ఇంటర్ రిజల్ట్స్' వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటివరకు డిగ్రీ అడ్మిషన్స్ లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, అభి, సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములు అప్పగించండి



తహసీల్దార్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వీరఘట్టం: మండలంలోని సంత – నర్సిపురంలో గతంలో ఇచ్చిన 151 ఎకరాల భూములను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ.. భూములు అప్పగించడంలో జాప్యం జరుగుతుండడంతో స్థానికంగా తగాదాలు జరుగుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భూముల వ్యవహారం కొలిక్కి వస్తోంది...

మండలలోని సంత – నర్సిపురం భూముల వ్యవహారం కొలిక్కి వస్తోందని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 2008లో 151 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఎకరా చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇందులో కొంత భూమిని లబ్ధిదారులకు అప్పగించగా.. మిగిలిన భూమిని కూడా సర్వే చేపట్టి త్వరలోనే అందజేస్తామని చెప్పారు.

యూరియా కష్టాలు వర్ణనాతీతం..



వీరఘట్టం మార్కెట్ యార్డులో బారులు తీరిన రైతులు

వీరఘట్టం: మండల రైతులకు యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. వీరఘట్టం మేజర్ పంచాయతీలో యూరియా కోసం సోమవారం స్థానిక మార్కెట్‌యార్డ్‌లో గల ఆర్ఎస్‌కే వద్ద రైతులు బారులు తీరారు. క్యూలో ఉండే ప్రతి రైతుకూ ఒక బస్తా యూరియా బస్తాను వ్యవసాయాధికారులు అందజేశారు. ఇదిలాఉంటే స్థానికంగా పీఏసీఎస్ ఉండడంతో ఆర్ఎస్‌కేలకు యూరియా ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని.. కావాల్సినంత యూరియాను తెప్పిస్తామని ఏఓ జె.సౌజన్య స్పష్టం చేశారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: రహదారి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్సై వై. అమ్మన్నరావు స్థానిక ఆటోడ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఘాట్‌రోడ్‌లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఘాట్‌రోడ్డులో సెల్ఫ్ ఆఫ్ చేసి చాలా మంది దిగుతున్నారని ఇది సరికాదన్నారు. వాహనాలను ఆన్‌లోనే ఉంచి గేర్‌లోనే దిగాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: రేగిడి పీహెచ్‌సీ పరిధిలోని కానసింగి గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ సోమవారం చేపట్టారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయని, మన ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ సూచించారు. మన ఇంట్లో, ఇంటి పరిసరాల్లో అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, ప్రతి ఇంట్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని తెలిపారు. అనంతరం రేగిడి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ని సందర్శించి, ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సమస్యతో ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఆయన వెంట సూపర్‌వైజర్ రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు



మరమ్మతులు చేసిన సదునుగూడ బీటీ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్...

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని సదునుగూడ బీటీ రోడ్డు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన సోమవారం చేపట్టారు. తారు ఊడిపోయిన చోట మళ్లీ పిక్కరాయి, తారు వేసి రోడ్డు చదును చేశారు. లక్కగూడ బీటీ రోడ్డు నుంచి సదునుగూడ వరకు రెండు నెలల క్రితమే ఈ రోడ్డు వేయగా ఇటీవల పెచ్చులూడిపోయింది. దీంతో ఈ నెల 23వ తేదీన 'నాసిరకంగా రోడ్డు నిర్మాణం' శీర్షికన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

పాలకొండ: నాగావళి ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకుడు బిడితి అప్పలనాయుడు కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు నీరు అందించాలన్నారు. కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని చెప్పారు. ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలని కోరారు.